
# తడిగొంతు

## పెద్దింటి అశోక్‌కుమార్

**కథ**



### ‘ఇగ లాభంలేదు.

### నేను బోర్‌బండి తేవల్సిందే...

### బోర్ వేయాల్సిందే!

**ఎవరు అడ్డమత్తడో సూత్త’ చుట్టూ మంది నంతా కలియజూసి పటపట పండ్లు కొరు కుతూ అన్నాడు సంజీవు.**

**ఆ మాటలు విన్న దేవిరెడ్డి ఉల్కిపడ్డాడు. పక్కనే ఇద్దరు ముగ్గురు పెద్ద మనుషులున్నారు. వాళ్లు చెంపదెబ్బతిన్నట్టు అదిరిపడ్డారు. ఏమిటని రెట్టించి అడగటానిక్కూడా భయపడ్డారు.**

**వెంట ముసలితల్లి కూడా ఉంది. జ్వరంతో వణుకుతుంది. ఈ మాటలు విన్నాక మరింతగా వణికింది. కొడుకు మర్మం తెలుసు. వీడు అన్నంత పని చేస్తడు. నేను వచ్చుదేందోగని కొత్త పంచాది పుట్టవట్టె’ అనుకుని రెండడుగులు వెనక్కి తొక్కింది.**

‘బండి తెచ్చుడు తెచ్చుడే... బోర్ ఏసుడు ఏసుడే...’ అందరూ వినాలని మరోసారి అన్నాడు సంజీవు. ఈ మాటలు ఇప్పుడేకాదు రెండు నెలల కిందనే ఒకసారి అన్నాడు. అప్పుడు కూడా వెంట చాలామందే ఉన్నారు కాని ఇప్పటిలా ఎవరూ భయపడలేదు. ఒక్క భగవంతం మాత్రమే భయపడ్డాడు. అందరినీ జమకొట్టి సంజీవుపైకి ఉసిగొలిపాడు. ఇంకొకరు ఆమాట అనకుండా కాయితం రాయించుకున్నాడు.

“బోర్‌బండి ఊర్లెకత్తె జనం నోరెండి సత్తరు” హెచ్చరిస్తున్నట్టుగా అన్నాడు దేవిరెడ్డి.

అది ఎదురుకాలం. వానలు లేక నాలుగేండ్లయింది. భూమిల తడి లేదు. బాయిలు ఎండిపోయినయి. బోర్లు బోర్లవడ్డయి. రెండ మూడు పసల్లనుండి సాగునీరులేక ఊర్లె పచ్చటి మొక్కలు మొలువలేదు. ఈసాలుకైతే తాగునీరే కరువయింది. ఊరికింది మడికట్లల్ల రెండు బోర్లు వేసి, కొద్దికొద్దిగా ఊరే నీటిని పొద్దంతా నీళ్లట్యాంక్‌లోకి ఎక్కించి, రాత్రిపూట పావుగంటసేపు నల్లాలు వదులుతున్నారు.

చాలీచాలని నీటితోనే గొంతు తడుపుకుని ప్రాణాన్ని నిలబెట్టుకుంటున్నారు జనం. నీటిచుక్క యాడ కనవడ్డా కళ్లకద్దుకుంటున్నారు. అన్ని సమస్యలకంటే తాగు నీళ్ల సమస్యే ప్రధానమైపోయింది.

ఎలా ఆలోచించాడోకాని భగవంతం, ఊరికింది తన పొలంలోకి వెళ్లాడు. కొబ్బరికాయ పుల్లతో పాయింటు చూపించి బోర్ వేయించాడు. మూడువందల ఫీట్ల దగ్గర పెద్ద గ్యాప్ వచ్చింది. పాతాలగంగ పైకి వచ్చింది. మోటర్ ఫిట్‌చేసి నాగలి కట్టాడు.

ఎప్పుడైతే భగవంతం బోరు మొదలయిందో అప్పుడే నల్లాల బోర్లు ఎండిపోయాయి. అవేకాదు, ఊరిలో అక్కడక్కడా కొద్దికొద్దిగా ఊరే చేతి బోరింగ్‌లు, వాడకొక చాదబాయి... ఊరిలోని చెమ్మంతా పెద్దబోరుకు మళ్లింది. ఎక్కడా నీటిచుక్కలేదు. ఊరు తల్లడమల్లడమయింది. ఖాళీ బిందెలతో గేరచ్చినట్టు తిరుగుతున్నారు. హాండ్ బోర్లను కొడుతుంటె చెమటచుక్కలే రాలుతున్నాయి.

భయంభయంగా పొద్దుగూకింది. ఊరుగావరయింది. డబ్బు నగలతో పాటు నీళ్లను కూడా దాచుకుని కట్టెలతో కావలున్నారు కొందరు. భగవంతంది దుక్కి మొత్తం నానింది. ఊరు ఊరంతా భయం గుప్పిటిలో ఒదిగిపోయింది.

సర్పంచ్ బాల్‌రాజుకు అందరికంటే ఎక్కువగా భయం పట్టుకుంది. రిజర్వేషన్ కావడంతో కాండేట్స్‌లేరని యూనివర్సిటీ నుంచి బాల్‌రాజును పట్టుకొచ్చారు. ఊరికి ఏదో చేయాలని ఆరాటంతో వచ్చాడు. గద్దెనెక్కిన నాటినుండే గండగరువు. ఫుడ్ ఫర్ వర్క్, జె.బి. పనులు తెచ్చి అంతో ఇంతో పనులు కల్పించి బియ్యం పంచుతున్నాడు. ఇంటికి చారెడో దోశెడో నీళ్లను ఇస్తున్నాడు. ఇప్పుడు నష్పతుగ మెడలు ఇరిసినట్టయింది.

గడియలు గంటలమీద బోర్‌బండి తెప్పించి రెండుచోట్ల దించాడు బాల్‌రాజు. పొగనే తప్ప నీటిచుక్క రాలేదు. రాతిపొగ ఊరంతా కమ్ముకుని మరింత భయపెట్టింది. బోర్ బిట్లు ఇరిగిపోయాయి. ఒకరిద్దరు దొంగతనంగా భగవంతం బోరు దగ్గరి నుండి నీళ్లు తెచ్చారు. అది గమనించి పట్నంలో ఉన్న కొడుకును రప్పించాడు భగవంతం. అతడు వకీలుపని చేస్తాడు. తన బలగంతో వచ్చి కార్లో నాలుగు చెక్కర్లు కొట్టాడు. కానూన్ గురించి, వ్యక్తిగత ఆస్తుల గురించి అక్కడక్కడా మాట్లాడాడు. ఆకాశంలో గద్దలు తిరిగినప్పుడు భయంతో దాక్కున్న కోడిపిల్లలా ఊరు ఒదిగిపోయింది. బోరువైపు మనిషి కాదు. పశువు కూడా కన్నెత్తి చూడడంలేదు.

బాల్‌రాజు కమిటీ మెంబర్లతో మీటింగ్ పెట్టి నీళ్లముచ్చటను చర్చించాడు. కొందరు ఖాళీ బిందెలతో కలెక్టరేట్ వెళ్లాలన్నారు. కొందరు సెక్రటేరియట్ వెళ్లాలన్నారు. ఇద్దరు సి.ఎం.కు ఫాక్స్‌మెసేజ్ ఇవ్వా లంటే ఇంకో ఇద్దరు పేపర్‌కు ఇయ్యాలన్నారు. అందరి మాటలు విన్నాక నోరు విప్పాడు దేవిరెడ్డి. ఊరికి ఉపసర్పంచ్. మాట్లాడితే సందు దొరుకది. సర్పంచ్ మీ ఎస్సీలకుంటే ఇది మాకుండద్దా అన్న భలమైన పాయింటు మీద ప్యానల్ లేకున్నా పదవికెక్కాడు. ఊరిలో పెద్ద మనిషి కూడా!

ఇయ్యేల్ల కలెక్టర్ దగ్గరికి సి.ఎం. దగ్గరికి పోతరు. మీకు ఎంటనే నీళ్లు నింపి పంపిత్తరా? సూత్తం పో... చేత్తంపో అంటరు. వచ్చి చూసే వరకు సచ్చిమన్నయిపోతం. జరుగబోయే ముచ్చట జెప్పండ్రిరా అంటే దర్నా జేద్దాంగిర్నా జెద్దామంటరు. ఇప్పటికి నీళ్లలేక రెండుదినాలైంది” దేవిరెడ్డి యాష్టగా అన్నాడు. వయసులో అందరికంటే పెద్ద. నడేడు తిరిగింది.

“చేసే పని ఒక్కటే... భగవంతం పటేల్ బోర్‌ను టాంక్‌లకు మలుపాలె. ఊరంత ఒక్కటి కావాలె” చంద్రం అన్నాడు కాస్త ఆవేశంగా. బాల్‌రాజు ఆలోచనగా వింటున్నాడు.

దేవిరెడ్డి కోపంగా చూసాడు. “ఆ మాత్రం తెలివి మాకున్నాది...?

నువ్వు చెప్పితెనే ఎరుకైతంది! ఉరుకుండ్రి ఉరుకుండ్రి అంటే ఊరు మా ఉరుకుతరు. మరి వాడూకుంటాడ్రా. కేసులు, తన్నులు, స్టేషన్లు, కోర్టులు... అప్పుడు నల్లా నీళ్లు కాదు. కన్నీళ్లు కారుతయి. అసలే వాని కొడుకు లాయరు. ఊరు ఇప్పుడిప్పుడే కోలుకుంటుంది. మల్లా ఇసం పెట్టద్దు" హితవు చెప్పాడు.

"మరి ఏంజేత్తామంటరు...?" బాల్‌రాజు అడిగాడు.

"ఎంతో కొంత ఒప్పుకుని బోర్‌నీళ్లను టాంక్‌కు మలుపాలె. బతిలాడాలె" దేవిరెడ్డి అన్నాడు.

'ఆయిన ఎన్నడొప్పుకోవాలె!' ఒక మెంబర్ అన్నాడు. 'కుండీల నీళ్లు ఎత్తుకపోతున్నరని పెండగలిపిండట!' మరో మెంబర్ అన్నాడు. 'మాకు ఈ ఆలోచన రాలేదని కాదు. మనిషి మర్మం తెలిసి గుంజుకున్నం" మరో మెంబర్ పెదవి విరిచాడు.

"ఇస్తే ఇచ్చె. ఇయ్యకపోతే మనమే తీసుకుందాం. భూమిల నీళ్లు ఆయిన సొంతమా...?" చంద్రం అన్నాడు.

"ఇట్ల ఉరుకులాడితే నువ్వు నేను మంచిగనే ఉంటం. నడుమల ఊరు ఆగమైతది. పెద్ద మనిషన్నప్పుడు పెద్ద మనుసులుండాలె. నాలుగు తొవ్వలు తొక్కి చూడాలె. నేను ఒప్పిస్తపాండ్రి" అంటూ ముందుకు నడిచాడు దేవిరెడ్డి.


అందరూ భగవంతం భవంతి ముందు భగీరథ ప్రయత్నం చేసారు. దయచూపుమని వేడుకున్నారు. మా భగవంతుడు మీరేనని మొక్కుకున్నారు. కొండంత దేవునికి కొండంత కానుకలివ్వలేమని పూలు పత్రితో నైవేద్యం పెడతామన్నారు.

"అంటే... నా పొలం బోరు కొంటారన్నమాట" నవ్వుతూ అన్నాడు భగవంతం. మనిషికిందా మీదా ఒకేరకంగా, తుమ్మమొద్దుకు బట్టలు కట్టినట్టుంటాడు.

"అయ్యా! అదెంతమాట! మీ ఐదె కురాల పొలం బోరు కొనే తాఖతు మాకెక్కడిది. ఏదో ఇన్ని మంచినీళ్లిచ్చి జీవగంజిపోస్తే మీపేరు జెప్పి ఊరు దీపం పెట్టుకుంటది. పుట్టెబిడ్డలకు మీ పేరు పెట్టుకుంటరు" దేవిరెడ్డి అన్నాడు. మిగిలినవారు తలూపారు.

"నేను నిజంగనే అంటున్న. నా పొలం కొనుండ్రి. ఎకురాన లక్ష" నమ్మకంగా అన్నాడు భగవంతం.

అంత బడ్జెట్ జి.పిలో లేదని వచ్చే జన్మభూమిలో ఏదైనా నిధులు మళ్లిస్తామని ఇప్పటి మందం నీళ్లు ఇయ్యమని మొరపెట్టుకున్నారు.



"నేను మూడెకురాల పొలం నాటేత్త. ఎకురాన నాలుగు పుట్ల పంట. నాలుగు ఎకురాలకు పన్నెండు పుట్లు. పుట్టికి ఏడుకింటళ్లు. పన్నెండు పుట్లకు ఎనభైనాలుగు కింటళ్లు. కింటలుకు ఐదువందలు. మొత్తం నలుపైరెండు వెయిలు. ఒక్కసారి కాకుంటే రెండు కిస్తీలు కట్టండ్రి" నెమ్మదిగా లెక్క చెప్పాడు భగవంతం.

లెక్క నిజమే అనిపిస్తుంది. ఎక్కడో కిటుకున్నట్టనిపిస్తుంది. ఒకరు పటేలు న్యాయమే మాట్లాడిండన్నారు. మరొకరు అన్యాయమన్నారు. అన్నీ తేల్చుకున్నాకే రమ్మని భగవంతం లేచిపోయాడు. అందరూ బయటకు వచ్చారు. సల్లచెమటలు పుట్టినయి.

"దవఖాన్ల చూపిస్తే ఖర్చయితదని కన్నతండ్రికి ఇసంబెట్టి చంపిండు. వీడెన్నడు ఒప్పుకోవాలె. నీళ్లను కొనుక్కచ్చినట్టు లెక్కగడుతుండు" చంద్రం కోపంగా అన్నాడు. దేవిరెడ్డికి చంద్రంకు వాదం జరిగింది. బాల్‌రాజు ఇద్దరినీ సముదాయించాడు.

"నువ్వు వట్టిగనే ఉరుకులాడుతవు. మాటమాట్లాడితే మునాసముండాలె. నువ్వయితే వట్టిగనే ఇత్తవా...? నాదిగాకపోతే ఊరంత పంచుత అన్నట్టు చెయ్యదు" కోపగించుకున్నాడు రెడ్డి. అందరూ కలిసి శాంతపరిచి భగవంతను ఒప్పించే బాధ్యత రెడ్డిపైన పెట్టారు. అందరూ లోపలికి వెళ్లారు.

ఊర్లె రెండువందల నల్లా కనెక్షన్లున్నాయి. నెలకు మూడు వెయిల బిల్లు వస్తుందని దాన్ని నెలనెలా భగవంతంకే ఇస్తామని బతిమాలి ఒప్పించారు. ఇంకో ఐదు రూపాయల బిల్లు పెంచుతూ, కొత్త కనెక్షన్లు తీసుకుంటే ఐదువందల డిపాజిట్ చెల్లించే ఒప్పందం మీద ఒప్పుకున్నాడు భగవంతం. అంత లాసుకు ఎట్ల ఒప్పుకున్నవని భార్య గులిగింది. 'ఏంజెద్దాం! ఊరును కాపాడుకోవాలె' గుబునంగా నవ్వుతూ అన్నాడు భగవంతం.

"ఊర్లెకు ఎవడూ బోర్ బండి తేవద్దు. అట్లయితెనే సరె! లేదంటే మీదారి మీది. నా దారి నాది" ఖచ్చితంగా అన్నాడు భగవంతం. 'వీళ్లతాత జాగిరనుకుంటండ్రా ఏంది? ఆటలాడిత్తండ్రు. మీరు గాళ్లను బుదురకిత్తండ్రు. మీరు 'ఊ' అనుండ్రి.

ఒప్పందం కుదరగానే పైపులు వేసి టాంక్‌కు కలిపారు. పొద్దుగూకే లోపు నల్లాలకు ప్రాణం వచ్చింది. జనం గొంతు తడుపుకుని పండుగ చేసుకున్నారు. మరునాడు ఊరంతా తిరుగుతూ బజారు నల్లాలు, నల్లాల కింద మడుగుగట్టిన నీళ్లను చూసాడు భగవంతం. ఆ నల్లాలు బిల్లుకట్టే లెక్కలో లేవని తెలుసు. వెంటనే ఒక ఐడియా వచ్చింది. సర్పంచ్‌ని పిలిచి బజారు నల్లాల ద్వారా నీళ్లు వృధా అవుతున్నాయని అట్లాకాకుండా చూడుమని హెచ్చరించాడు. సర్పంచ్ సరేనన్నాడు.

బజార్లలో అక్కడక్కడ పబ్లిక్ నల్లా. కనెక్షన్లు లేనోళ్లు పట్టుకుంటారు. బిందె బిందెకూ మధ్య కొన్ని నీళ్లు కారిపోతాయి. మల్లా మడుగుకట్టాయి. వెంటనే వాటిని సీల్ చేసాడు భగవంతం. ఫలితంగా ఇరువై కనెక్షన్లు పెరిగాయి. పది వెయిల డిపాజిట్ వచ్చింది.

అదిగో... అప్పుడు మొదటిసారిగా 'నేను బోర్ బండి తేవాల్సిందే' అన్నాడు సంజీవు. అనుకున్నదే ఆలస్యంగా బండికి భయానా ఇచ్చివచ్చాడు. ఈ విషయం తెలిసి భగ్గుమన్నాడు భగవంతం. మోటర్‌కు తాళం వేసాడు. నీళ్లు ఇయ్యనని మొండిగా చెప్పాడు. ఊరు మరోసారి భయంభయంగా ఒదిగిపోయింది.

భగవంతం, సంజీవు ఇద్దరన్నదమ్ములు. వీరికి పట్నంలో ఒక అన్న ఉన్నాడు. ఉద్యోగంతో అక్కడే స్థిరపడ్డాడు. అన్నదమ్ములిద్దరి పొలాలు పక్క పక్కనే! ఇండ్లు కూడా! మధ్యలో మాత్రం మనిషికి మనిషి కనబడకుండా పెద్దగోడ, గోడమీద గాజుపెంకులు. పొలాల మధ్య ఇనుపవైరు.

సంజీవు ఇంటిముందు బజారు నల్ల. కావలసినన్ని నీళ్లను మోసుకునేవారు. ఎవరో సీల్ చేస్తే వెంటనే మరిచిపోయేవాడేకాని అన్ననే చేయడంతో కావాలని చేసిండని జిద్దుగా కూసున్నాడు.

వాటర్ టాంక్ ఎత్తుపైన ఉంటే ఊరంతా కవరవుతుందని సంజీవు దొడ్లగడ్డ పెరట్లో కట్టారు. అప్పుడు కంట్రాక్టర్ దగ్గర బాగానే గుంజాడంటారు. సంజీవు బోరు వేస్తే భగవంతంది ఎత్తిపోతదని భయం.

"నా జాగల టాకి గడుతరు. నాకే ఇయ్యరు. మీ నాటుకాలు జూత్త. ఎవడు అడ్డమస్తడో చూస్త" అన్నాడు. అన్న చదివించాడని తన కొడుకును కూడా లాయరు చదివించాడు సంజీవు. అతడిక్కూడా చెప్పి పంపడంతో వచ్చి కారు మీద నాలుగు చక్కర్లు కొట్టిపోయాడు. పోతూపోతూ తన తండ్రిని బోర్ వేయకుండా ఎవరు ఆపినా ఏం జరుగుతుందో చెప్పిపోయాడు.

నీళ్లలేక రెండురోజులయింది. గడ్డమీది చేపలా ఊరు తల్లడమల్లడమయింది. పంచాయతీ కమిటి మరోసారి సమావేశమై భగవంతంను కలిసింది. బతిలాడింది.

"ఊర్లెకు ఎవడూ బోర్ బండి తేవద్దు. అట్లయితెనే సరె! లేదంటే మీదారి మీది. నా దారి నాది" ఖచ్చితంగా అన్నాడు భగవంతం. 'వీళ్లతాత జాగిరనుకుంటండ్రా ఏంది? ఆటలాడిత్తండ్రు. మీరు గాళ్లను బుదురకిత్తండ్రు. మీరు 'ఊ' అనుండ్రి. రెండురోజులల్ల పంచాది లేకుండ జేత్త' మండిపడుతూ అన్నాడు చంద్రం.

చంద్రంను బాల్‌రాజు సముదాయించి బరువును దేవిరెడ్డి మీద ఎత్తాడు. దేవిరెడ్డికి భగవంతం చాలా దగ్గరకాబట్టి సంజీవు చాలాదూరం అయినా పని భుజానేసుకుని ఎవరినెవరినో కలిసాడు. సంజీవు బోర్ వెయ్యకుండా ప్రయత్నం చేసాడు.

సంజీవు ఫ్రీగా నల్లా కనెక్షన్, జీవితాంతం బిల్లులేదు. నల్లా మెటీరియల్ ఖర్చంతా జి.పి. భరిస్తేనే ఒప్పుకుంటానన్నాడు. బాల్‌రాజ్ లోలోపల పళ్లు కొరుక్కుంటూనే ఒప్పుకున్నాడు. గంటలమీద సంజీవు ఇంటికి నల్లా కనెక్షన్ వచ్చింది.

జి.పి. లెటర్‌పాడ్ మీద బోర్ బండి ఎవరూ తేకుండా కాయితం రాసుకున్నాక గానీ మోటర్ తాళం తెరువలేదు భగవంతం.

నెల్ల గడవక ముందే కరెంట్ మోటర్ వాడచ్చాడు. మోటార్‌ను ఉద్దెర తెచ్చాడని అప్పటివరకు ఎవరికీ తెలియదు. డబ్బు కట్టకపోతే పీక్క పోతానన్నాడు. భగవంతం చేతులెత్తాడు. అప్పటి కప్పుడు ఎక్కడో మిత్తికి తెచ్చిచ్చాడు బాల్‌రాజు.



వారం గడవకముందే కరెంటు వాళ్లచ్చారు. మీటర్ సాంక్షన్‌లేదని వైరు కట్ చేసారు. దండుగు జురుమానా అన్నారు. మోటర్‌కు సాంక్షన్ లేదని అప్పటిగ్గాని ఎవరికీ తెలియ లేదు.

“ఆనాడు గుత్తకు మాట్లాడిన్నాడు అన్నీ ఉన్నయనే మాట్లాడితిమి. ఇయ్యాల్ల ఒక్కొక్కటి మాకే రుద్దితే ఎట్ల” కోపంగా అన్నాడు బాల్‌రాజు.

“గది గుర్రం. గిది మైదాన్. ఇప్పటికైనా మీ ఇష్టం. కాదంటే నాగలి కట్టి దున్నుకుంట. నేను మీ దగ్గరి కచ్చిన్నా మీరు నా దగ్గరి కచ్చిండ్రా” అన్నాడు కానూన్‌గా. దేవిరెడ్డి కలుగజేసుకుని బాల్‌రాజుకు నచ్చజెప్పాడు. మనం ఏం తొందరపడ్డా నష్టపోయేది ఊరేనని ఊరికొరకైనా ఓపిగ్గా ఉండాలని సలహా ఇచ్చాడు.

లైన్‌మెన్‌తో మాట్లాడి కొంత ముట్టజెప్పి వారంలో సాంక్షన్ తెచ్చాడు బాల్‌రాజు.

రెండు నెలలు గడిచింది. ఈలోపు ఇద్దరు ముగ్గురు బోర్‌బండ్లకు బయాన పెట్టారు. ఎప్పటికప్పుడు అదే విషయాన్ని ఎంక్వయిరీ చేస్తున్న భగవంతం మోటార్‌కు తాళం వేస్తానని బెదిరించాడు. దేవిరెడ్డి కల్పించుకుని దండుగు జురుమానా అని బెదిరించి మాన్పించాడు. మరునాడే ఊర్లెకు బోర్‌బండి ఎవరు తెచ్చినా పదివెయిల జురుమానా అని చాటింపు వేసారు.

నెలకు నాలుగైదు రోజులైనా నీళ్లను బందు పెడుతున్నాడు భగవంతం. బిల్లు ఇస్తలేరని ఒక సారి బిల్లు పెంచుతానని మరోసారి, నీళ్లను మోర్లల్లో వదులుతున్నారని రకరకాల కారణాలు చెబుతున్నాడు. రోజుకు రెండుసార్లయినా ఊరంతా తిరుగుతున్నాడు. ఇంటిముందు తడి కనిపిస్తే చాలు గాయికెత్తుకుని తిడుతున్నాడు. భగవంతం భయానికి వాకిట్లో సానుపుకూడా ఎవరూ చల్లడంలేదు. నీటిని పావుగంటకంటే ఎక్కువసేపు వదలడంలేదు. అదీ అర్థరాత్రిపూట.

నల్లా ఆగినప్పుడల్లా దారలా జనం సర్పంచ్ ఇంటిముందుకెళ్తున్నారు. అందరికీ నయానా భయానా నచ్చజెప్పి తేపకో కాగితం రాసిస్తూ భగవంతంను, బాల్‌రాజును శాంతపరుస్తున్నాడు దేవిరెడ్డి. ఈ పద్ధతేం బాగలేదు. ఊరంతా ఏమనుకుంటారని భార్య కోప్పడితే ‘పిచ్చిదాన... అగ్గి రాజుకోకముందే జాగ్రత్తపడాలె. అప్పుడప్పుడు నీళ్లు సల్లుతనే ఉండాలె. మనుషులను భయపెడతనే ఉండాలె’ అన్నాడు. అదేమిటో ఆమెకు అర్థంకాలేదు. తెగేదాక లాగద్దని మాత్రం గట్టిగా చెప్పింది.

ఇన్నిరోజులది ఒక ఎత్తయితే ఇప్పటి పంచాది ఒక ఎత్తయింది.

భగవంతం కుటుంబంలో ముగ్గురి మధ్యా చావలేక బతుకుతున్న ముసలి తల్లి ఉన్నది. కేలండర్ చూస్తూ సరిగ్గా మనిషికి నాలుగు నెలలుంచుకుంటున్నారు. పెద్దకొడుకు దగ్గరుండగా చివరివారంలో మోదెకాలుతో జ్వరం వచ్చింది. హాస్పిటల్‌లో చూయించాల్సి వస్తుందని వారంరోజుల ముందే తమ్ముళ్ల దగ్గరికి పంపించాడు. అనుకోకుండా యాత్రలకు వెళ్తున్నామని మరోసారి వారంరోజులు ఎక్కువ ఉంచుకుంటానని ఫోన్ చేసాడు.

విషయం గ్రహించిన సంజీవు తల్లిని కడుపదాట నీయలేదు. భగవంతం గైనుదాటనియ్యలేదు. వంతు వంతే! ఎందుకచ్చినవని ఈసడించుకున్నారు. ఇద్దరి ఇండ్ల మధ్య తిరిగే తిరిగే గ్రామ పంచాయితిలో తలదాచుకుంది. భయంతో జరం ఎక్కువయింది. సోయిలేదు. శుద్దిలేదు.

ముందుజాగ్రత్తగా బాల్‌రాజును ఇంటికి పిలిపించుకున్నాడు భగవంతం. అప్పటికే దేవిరెడ్డి కూడా ఉన్నాడు.

“మా అవ్వకు కాలు జరం. ఇప్పుడు మా ఇంట్లకు వచ్చిందనుకో... వారంరోజులు నేను దవాఖాన్ల తిరుగాలె. ఇక్కడ టాంకును ఎవలకో అప్పజెప్పిననుకో... నాలుగు రోజులకే భూమిలున్న నీళ్లన్నీ కతం జేస్తరు. తర్వాత నీళ్లు లెవ్వన నిన్నే గోసపెడుతరు. నీ ఎంబడి జనమున్నరు. నువ్వు ఏది మాట్లాడినా కరక్టేనంటరు. మా అవ్వకు మా తమ్మునింటికి తోలే ప్రయత్నం జెయ్యి. ఎట్లాగూ వారం తర్వాత వానిదే వంతు” నచ్చజెప్పాడు.

“ఏమనద్దు! వారం తర్వాత ఎవల వంతు? అని అడుగాలె. నాదేనంటడు. తోలుకపో అనాలె! మెత్తమెత్తగ అంటే ఇనడు. గట్టిగ మాట్లాడాలె” దేవిరెడ్డి సలహా ఇచ్చాడు బాల్‌రాజ్‌కు.

బాల్‌రాజుకు ఏదోలా ఉంది. కడుపుల దేవినట్టయింది. గుండె కలుక్కుమంది. పెదవికూడా విప్పలేదు. మరునాడు బాల్‌రాజును నిలబెట్టి దేవిరెడ్డే తీర్పు చెప్పాడు.

ముసలి తల్లి కొడుకుల గురించి కష్టపడిన తీరును వివరించాడు. కన్నతల్లిని కష్టపెట్టుకుంటే రేపు మన పిల్లలు కూడా ఇలాగే చూస్తారని హితవు చెప్పాడు. అతడి మాటలకు జనం కదిలిపోయారు. ఒకరిద్దరు ముసలొల్లయితే భారతవ్వ దొర్సానికి ఎంత కట్టమచ్చిందని సోకం తీసారు. అన్ని తరీకలున్న దొర్సానిదే గట్లాయె. చెప్ప ఇసిరితే కుండ తలుగని మా బతుకులెట్లని తొక్కులాడిండ్రు. సంజీవును మనిషికొకమాటన్నారు. ఇసొంటి కొడుకును పుట్టంగనే బొందపెట్టాలన్నారు.

జి.పి. లెటర్‌పాడ్ మీద బోర్ బండి ఎవరూ తేకుండా కాయితం రాసుకున్నాక గానీ మోటర్ తాళం తెరువలేదు భగవంతం. నెల గడవక ముందే కరెంట్ మోటర్ వాడచ్చాడు. మోటార్‌ను ఉద్దెర తెచ్చాడని అప్పటివరకు ఎవరికీ తెలియదు. డబ్బు కట్టకపోతే పీక్కపోతానన్నాడు. భగవంతం చేతులెత్తాడు. అప్పటి కప్పుడు ఎక్కడో మిత్తికి తెచ్చిచ్చాడు బాల్‌రాజు.

అన్న సర్పంచ్‌ను కట్టుకుని తెలివిగా తప్పును తనమీదికి తోసాడని గ్రహించాడు సంజీవు. అన్న మీద కసి పెరిగిపోయింది. మారుమాటాడకుంట తల్లిని వెంటబెట్టుకుని ముందుకు నడిచాడు. నడుస్తూ నడుస్తూ ఆగి వెనక్కి తిరిగి చూసి-

ఆగో... ఇప్పుడు “బండి తెచ్చుడు తెచ్చుడే... బోర్ ఏసుడు ఏసుడే! వాడెవరు నన్ను వద్దనడానికి. భూమిని నీళ్లను గుత్తకు కొన్నడా...” మరోసారి అన్నాడు గట్టిగా.

“బోర్‌బండి ఊర్లెకత్తే జనం నోరెండి సత్తరు” హెచ్చరిస్తున్నట్టుగా అన్నాడు దేవిరెడ్డి.

“ఎవడు సచ్చినా ఎవడు బతికినా తెచ్చుడు మాత్రం ఆగది. మీ దమ్ముల్న పని చేసుకోండ్రి” ముందుకు కదిలాడు సంజీవు. వెంటఉన్న తల్లి మరోసారి వణికింది. లేని పంచాదిపెడితిననుకుని మరోసారి బాధపడింది.

సంజీవు అటు కొడుక్కు ఇటు బోర్ బండికి ఫోన్ చేసాడు. మాట

బలంకావాలని దేవిరెడ్డిని పట్టుకున్నాడు. రాత్రికి రాత్రె తన మనిషిని చేసుకున్నాడు. కొడుకు వచ్చి ఊర్లో నాలుగు చక్కర్లు కొట్టాడు. మనిషికి ఉండే హక్కుల గురించి వాటిని అడ్డుకుంటే పడే శిక్ష గురించి అక్కడక్కడా చర్చించాడు.

'ఒక్క బోరు నీళ్లు సరిపోతలెవ్వు! ఇప్పుడే ఇట్లుంటే రేపు ఎండకాలం ఎట్ల. రెండు బోర్లు ఉండాల్సిందే!' దేవిరెడ్డి కొత్తపాటను ఎత్తుకున్నాడు. ఇది గమనించి చంద్రంను వెంటేసుకున్నాడు భగవంతం. తాను కూడా కొడుక్కు ఫోన్ చేసాడు. అతడు వచ్చి ఊరిలో నాలుగు చక్కర్లు కొట్టి బోర్ పక్కకు బోర్ వేయకూడదనే కొత్త చట్టాన్ని అందరికీ పరిచయం చేసాడు.

భగవంతం మోటర్‌కు తాళం వేసాడు. శత్రువులు చుట్టుముట్టిన ఊరిలా మరోసారి పల్లె భయంభయంగా ఒదిగిపోయింది.

చీకటి జడలు ముడుచుకోకముందే రోద చేస్తూ బోర్‌బండి ఊరిలోకి వచ్చింది. ఎవరో చెబితే కబీరు వద్దకు వచ్చాడు బాల్‌రాజు. అప్పటికే మంది జమకూడారు. ఏదేదో అంటున్నారు. అరుస్తున్నారు. తోసుకుంటున్నారు.

"ఊరిమాటనే కాదంటాడా...? వద్దనంగ బండిని తెచ్చిండు. కదురినియ్యకుండ్రి. 'వెనుక వైపున ఉండి జనాన్ని ఎగదోస్తున్నాడు భగవంతం. అతడి గొంతుతో గొంతు కలుపుతున్నాడు చంద్రం.

"నీళ్లు భూమి ఎవనిసొత్తుగాదు. ఎవనిష్టం వానిది. నీళ్లు చేతులున్నయని మిమ్ముల్ని ఆడిత్తండు. ఆడోళ్లను మొగోళ్లను నోటికచ్చిన బూతు తిడుతండు. వాని మాట వినకుండ్రి. బండికి అడ్డం రాకుండ్రి" మరోవైపున వెనుకనుండి సంజీవు ఎగదోస్తున్నాడు. అతడి గొంతుతో గొంతు కలిపిన దేవిరెడ్డి చంద్రంతో వాదనకు దిగుతున్నాడు.

"నువ్వు వట్టిలఫంగవు. నీళ్లమీది తుంగ లెక్క మాట్లాడుతవు. మొన్నటిదాక ఇటు సపోటిచ్చినవు. ఏం అందిచ్చిండో ఇప్పుడు అటు సపోటిత్తున్నవు. మీరంతా మా బతుకులతో ఆడుకుంటుండ్రు. అందినవాడికి దోచు కుంటుండ్రు. ఇప్పుడుపోటికి బండితెచ్చి నీళ్ల తడిలేకుంట జేత్తున్నవు" కోపంగా అన్నాడు చంద్రం.

"నీకు సొంగి తెల్వది. గందం తెల్వది. ఇప్పుడే నీళ్లు అందుతలెవ్వు. ఎండకాలంల ఎట్ల. నేను ఊరు గురించే మాట్లాడుతున్న. రెండు బోర్లుంటే నీళ్లు అంగామైతయి" దేవిరెడ్డి అన్నాడు.



"బోర్‌బండి ఊర్లెకత్తే జనం నోరెండి సత్తరు" హెచ్చరిస్తున్నట్టుగా అన్నాడు దేవిరెడ్డి. "ఎవడు సచ్చినా ఎవడు బతికినా తెచ్చుడు మాత్రం ఆగది. మీ దమ్మున్న పని చేసుకోండ్రి" ముందుకు కదిలాడు సంజీవు. వెంటఉన్న తల్లి మరోసారి వణికింది. లేని పంచాది పెడితిననుకుని మరోసారి బాధపడింది.

"నువ్వు ఊరి గురించి కాదు. మాట బలమున్నదని మోసగాళ్లకు సపోటిత్తున్నవు. బండి ఎట్ల కదులుతదో చూస్త. పుట్టిందొకనాడు సచ్చిందొకనాడు. మమ్ముల్ని ఆడిత్తన్నవు. నిన్ను తంతే అందరు సాపయితరు" ఆవేశంగా దూసుకొచ్చాడు చంద్రం.

"నువ్వు నా ముంగట లాగు గట్టి బుడ్డపెత్తనం జేత్తున్నవు. బండి ఎందుకు కదలదో చూస్త. నీ అసొంటోళ్లు వందమంది అచ్చినా అడ్డం నరికి తీసుకపోత" దేవిరెడ్డి ముందుకొచ్చి గల్లా అందుకున్నాడు. చంద్రం సొలిగి కిందపడబోయి నిలదొక్కుకుని కలెవడ్డాడు. అందరిమాటలు బందయి వారిమాటలు మొదలయ్యాయి. అందరూ అటువైపు తిరిగారు.

బాల్‌రాజుకు నెత్తికి పోటెక్కింది. పరిస్థితి చూస్తే నిజంగా తలలు పలిగేలా ఉన్నాయి. కోడిపుంజుల కొట్లాటను చూస్తున్న యజమానుల్లా టెన్షన్‌గా ఉన్నారు భగవంతం, సంజీవు. చుట్టూ ఒకసారి పరిశీలనగా చూసి 'చంద్రం...' అన్నాడు కోపంగా.

అందరూ బాల్‌రాజు వైపు తిరిగారు. ముందుకు వెళ్లడానికి తొవ్వ ఇచ్చారు. చంద్రం కూడా ఆగి వెనక్కి తిరిగి చూసాడు. మందిలోంచి ముందుకెళ్లి చంద్రంను వెనక్కి లాక్కొచ్చాడు. బోర్‌బండికి అడ్డంగా ఉన్న వారిని పక్కకు జరుగమని చెప్పాడు. అతడి మొహం అంత సీరియస్‌గా ఉండడం ఎవరూ చూడలేదు. అందుకే భయంగా పక్కకు జరిగారు.

"బోర్ బండి ఎల్లనీ..." డ్రైవర్‌కు చెప్పాడు. సంజీవు మొహం వికసించింది. దేవిరెడ్డి చిరునవ్వు నవ్వాడు. బండి ముందుకు కదిలింది.

"అరేయ్... బాల్‌రాజు. నువ్వు కూడా అందులోనే కలిసినావురా? ఇప్పుడు ఒక్కడు ఒక్క పక్కనే పీక్క తింటుండు. రేపు ఇద్దరైతరు. బుక్కెడు నీళ్లు మింగనియ్యరు. ఉచ్చపోసినా ఇన్ని నీళ్లు ఎందుకు తాగినవని గోసపెడుతరు రా..." చంద్రం అరుస్తున్నాడు. అడ్డం తిరుగుమని అందరినీ బతిమాలుతున్నడు. ఆవేదనగా ఏడుస్తున్నాడు.

అతడి మాట ఎవరూ వినడంలేదు. అందరూ బాల్‌రాజు చుట్టే మూగారు. ఎందుకు పొమ్మన్నవని ఒకరు, నీళ్ల సంగతి ఏంటిదని ఒకరు, మంచిగ పొమ్మన్నడు. లేకుంటే పుర్రెలు పలుగుతుండెనని ఒకరు అడుగు కదులనియ్యకుంట అడుగుతున్నారు. 'తాత కొడుకుయి చెమడలు తియ్యిండ్రి. ఇప్పుడు నీళ్లు తెమ్మనుండ్రి" అంటూ జనాన్ని ఉసి గొల్పుతున్నాడు భగవంతం.

అందరికీ అన్నిరకాల సమాధానం చెబుతూ రెండురోజుల్లో నీటికరువు తీరుస్తానని హామీ ఇచ్చాడు బాల్‌రాజు. బాగా చదివినోడు. తెలిసినోడని అందరికీ గురి. ఏ మాట తప్పకుండా నీటికరువు తీరుస్తాడనుకున్నారు. దుగపడి ఒకరిద్దరు తప్ప ఎవరూ ఎక్కువ మాట్లాడలేదు.

ఆరోజు కూడా గొంతులు తడవలేదు. పొద్దు నడినెత్తిపైకి రాగానే కొత్త బోరు ఎత్తిపోతుందని వార్త తెలిసింది. నీటి ధారల్ని చూడడానికే జనమంతా తరలిపోయారు. రాత్రికి రాత్రే మోటార్ ఫిట్ చేసాడు సంజీవు.

తన బోరు ఎత్తిపోయిందేమోనని భయపడ్డాడు భగవంతం. అలా జరుగలేదు. రెండుబోర్లు పోటీపెట్టుకున్నట్టు ఎత్తెత్తిపోస్తున్నాయి. పాతాళ గంగను పైకి తీస్తున్నాయి. జరగాల్సిందంతా జరిగినాక జరుగబోయేదాని గురించి ఆలోచించాలన్న ఆలోచన ఇద్దరికీ వచ్చింది. ఇద్దరొక్కటైతే ఇద్దరికీ లాభమన్న ఆలోచన కూడా వచ్చింది. ఇద్దరికంటే ముందుగా చొరవ తీసుకుని రెండుబోర్లను ఒక్కటి చేసాడు దేవిరెడ్డి.

అన్నదమ్ములిద్దరూ రాత్రికి రాత్రే ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు. నల్లాబిల్లు పెంచాలనుకున్నారు. వచ్చిన బిల్లును చెరిసగం తీసుకోవాలనుకున్నారు. తల్లి మందులకయ్యే ఖర్చులో సగం పెట్టుకోవాలన్నాడు సంజీవు. అది ఒప్పుకుంటూ నల్లాల డిపాజిట్ అడగవద్దన్నాడు భగవంతం. తన అనుభవం కొద్ది నీళ్లను ఎలా బిగవట్టాలో చెప్పాడు భగవంతం. బాల్‌రాజుగాడు మామూలోడు కాదు. చదువుకున్న పోరడు. ఓ కన్నేసి ఉంచాలె అనుకున్నారిద్దరు.

తెల్లవారింది. కాపువాళ్ల ముసలోడు కాలం చేసిండు. ఊరికి సగంపైగా అదే కులం. అందరికీ సుట్టిముట్టుడు. నీళ్ల మునుగనిదే కదుపదాటద్దు. తానానికి గాదు. తాగుడుకే నీళ్లలెవ్వు.

'ఆ... మంచిగ సచ్చిండు. వాళ్లే కాళ్ల బేరానికస్తరు. మనం ఒదల ఇడువద్దు. పైస తగ్గించద్దు. ఊర్లెకు బోరు రాకుంట పాబందు చేసుకోవాలె" అన్నదమ్ములిద్దరూ బదులుకున్నారు.

అనుకున్నట్టుగానే నీల్లు ఇడువుమని మనుషులు వచ్చారు. మాటా ముచ్చట మాట్లాడుకుని రేటు ఖరారు చేసుకున్నాకే ఇడుస్తామని ఒకే గొంతుతో చెప్పారు. బేరానికి వస్తారని ఇద్దరూ ఎదురుచూసారు. ఎవరూ రాలేదు.

శవం లేచింది. శవంతోపాటే జనం కూడా!

"భూమిమీద సుక్క నీళ్లు లెవ్వు. తానాలు యాడ జేస్తరో సూత్తాం" ఇద్దరూ మరోసారి బదులుకున్నారు.

కాడు మీద బగ్గున మంటలు లేచాయి. జనం కూడా బగ్గుమన్నారు. తాళాలు పలిగాయి. ఎత్తిపోస్తున్న నీటిని నెత్తిమీద పోసుకున్నారు. దోసిట్లో పట్టుకుని తాగుతున్నారు.

"అవును. శరీరం నుండి చెమట కారినా ఇన్ని నీళ్లు ఎక్కడియంటరు. రేపు కడుపునొప్పితో వాంతులు చేసుకున్నా నీళ్లను కడుపుల దాచుకున్నడని బదునాం చేస్తడు. అయినా భూమిల నీళ్లు అందరియి. అమ్ముకునే హక్కు ఎవలకులేదు. కోడిని కోసేటప్పుడైనా కనీసం గొంతు తడుపుతరు. వీళ్లు నీళ్లకొరకే మన గొంతులొత్తుతరు. నిండమునిగితే సలి ఉండది. తెగాయిస్తే భయముండది. నడువుండ్రి" ముందుగా నిలబడి చెబుతున్నాడు బాల్‌రాజు.

తడారిన గొంతులు తడుస్తున్నాయి. నీళ్లు టాంక్‌లకు ఎక్కుతున్నాయి. అడ్డంపడిన అన్నదమ్ములిద్దరినీ జనం ఎక్కడో తొక్కి నడుస్తున్నారు. ●